క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు: యనమలకుదురులో పేకాటరాయుళ్లను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు కృష్ణానది వద్ద కొందరు పేకాటాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.1950 నగదు స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తి పై కేసు

పెనమలూరు: వివాహితను వేధిస్తున్న వ్యక్తి పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... కానూరు మాణిక్యనగర్‌కు చెందిన నాగులపల్లి దుర్గ భర్త నానాజీతో ఉంటుంది. ఆమె టైలరింగ్ పనులు చేస్తుంది. అయితే సనత్‌నగర్‌కు చెందిన వంశీ అనే వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి అసభ్యంగా ప్రవర్తించుతూ వేధించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు వంశీ పై కేసు నమోదు చేశారు.

మండల టాపర్ పూజితకు అభినందనలు



గన్నవరం: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో ప్రభుత్వ పాఠశాలల టాపర్‌గా స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థిని రెడ్డి సరోజిని నిలిచినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ అనిత తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో పూజితకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో మొత్తం 111 మంది విద్యార్థినులకుగాను 55 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. వీరిలో తొమ్మిది మంది 500పైగా మార్కులు వచ్చినట్లు వివరించారు. రెడ్డి పూజిత 575 మార్కులతో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. సీహెచ్ మానిక 547, డి. పార్థవి 545 మార్కులు సాధించినట్లు చెప్పారు. అనంతరం అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను అభినందించారు.

సెంట్ మేరీస్ విద్యార్థుల ప్రతిభ




కంకిపాడు: పది ఫలితాల్లో కంకిపాడు సెంట్ మేరీస్ పాఠశాల విద్యార్థు ప్రతిభ చాటారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో పది చదివిన వి.కోటేశ్వరమ్మ, బి.వర్షాబాయ్, పి.దివ్యశ్రీబాయ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులకూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ లేషా పాల్గొన్నారు.

శ్రీహనుమాన్ శోభా యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు శ్రీభువనేశ్వరీ పీఠంలో ఆదివారం శ్రీహనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో పీఠాధిపతులు కమలానందభారతీస్వామి శోభాయాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా భారతీస్వామి మాట్లాడుతూ.. ఈ నెల 14న హనుమజ్జయంతి సందర్భంగా జరగనున్న శోభాయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తద్వారా హిందూవుల ఐక్యతను చాటాలని కోరారు. హనుమాన్ శోభాయాత్ర గన్నవరం పరిసర ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు హిందూ చైతన్య వేదిక ప్రతినిధి ఎస్. శేషుకుమార్ తెలిపారు.

అలరించిన సంగీత స్రవంతి



విజయవాడకల్చరల్: సద్గురు త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం జయంతి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను మధురంగా గానం చేశారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, కార్తీక త్రివేణి, చిట్టా కార్తీక్, చిట్టా దీపక్, లంక తేజస్విని, పారుపల్లి ఇభానన్ సోదరులు సుబ్రహ్మణ్య సంగీత సమితి విద్యార్థినులు త్యాగరాజ స్వామి రచించిన పలు కీర్తనలను మధురంగా గానం చేశారు. సంస్థ నిర్వాహకుడు సీవీ రావు త్యాగరాజ స్వామి కృతి వైభవం అంశంగా ప్రసంగించారు. రామలక్ష్మి నిర్వహించిన కార్యక్రమంలో తొలుత సంగీత కళాకారులు, అభిమానులు త్యాగరాజ స్వామి విగ్రహానికి పూజలు చేశారు.

విద్యుత్ అవాంతరాలకు చెక్

- మారేడుమాకలో రూ.3.50 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం
- తుది దశకు చేరుకున్న పనులు
- మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు



మారేడుమాకలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్



విద్యుత్ సరఫరాను నియంత్రించే యంత్రం



పోరంకిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సబ్‌స్టేషన్

కంకిపాడు: విద్యుత్ సరఫరాలో తలెత్తే అవాంతరాలను పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా విద్యుత్ శాఖ చర్యలు తీసుకుంటోంది. గృహ వినియోగదారులు, రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా సాగుతోంది. ఇందులో భాగంలోనే మారేడుమాక గ్రామంలో చేపట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. త్వరలోనే సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపడుతున్నారు.

మారేడుమాక ప్రధాన గ్రామంలో రూ.3.50 కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మాణం చేపట్టారు. విద్యుత్ సరఫరా నియంత్రించే భారీ యంత్రాలను ఇప్పటికే అమర్చారు. ఫీడర్ల అనుసంధానంకు అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందుగా ఆ ప్రాంగణం పూర్తిగా పల్లంగా ఉండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మట్టితో ప్రాంగణాన్ని పూర్తిగా మెరక చేయించి నిర్మాణ పనులను చేపట్టారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటుగా విద్యుత్ లైన్ల అనుసంధానం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుపై దృష్టి సారించారు.

త్వరలోనే అందుబాటులోకి....

ప్రస్తుతం ఉప్పలూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మారేడుమాక, తెన్నేరు పరిసర గ్రామాల ప్రజలకు విద్యుత్ సేవలు అందుతున్నాయి. దీని వల్ల లో ఓల్టేజీ, విద్యుత్ లైన్ల మరమ్మతులు విద్యుత్ అంతరాయాల వల్ల అడపా దడపా ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు గానూ మారేడుమాక కేంద్రంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. త్వరలోనే సబ్‌స్టేషన్ అందుబాటులోకి రానుంది. మారేడుమాక పరిసర గ్రామాలకు విద్యుత్ సేవలు మరింత మెరుగ్గా అందనున్నాయి.

రూ.5.50 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం.

పెనమలూరు: పోరంకిలో రూ.5.50 కోట్లతో అత్యాధునిక విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేశారు. ఈ సబ్‌స్టేషన్‌ను త్వరలో ప్రారంభించి విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయటానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. విజయవాడనగర శివారు తాడిగడప మున్సిపాలిటీ స్థిర నివాసాలు నానాటికీ పెరగుతుండటంతో విద్యుత్ డిమాండ్ ఇటీవల కాలంలో చాలా పెరిగింది. దీంతో పోరంకి కృష్ణాపురంకాలనీలో సబ్‌స్టేషన్ నిర్మాణం గత కొద్ది నెలల క్రితం చేపట్టి పూర్తి చేశారు. ఆధునిక పరికరాలు, విద్యుత్ లైన్ల చేపట్టారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఉండే 10 ఎంవీఏ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేసి అన్ని హంగులతో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 8416 విద్యుత్ కనెక్షన్‌లకు లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. 11 కేవీ లైన్‌తో పాటు 33 కేవీ లైన్‌లు దాదాపు ఏడు కిలోమీటర్ల మేర కొత్తగా వేశారు. అదే విధంగా 11 టవర్లు, ఏడు ఫీడర్లు ఏర్పాటు చేసి ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తారు. ఈ విద్యుత్ సబ్‌స్టేస్‌తో నారాయణపురంకాలనీ, పద్మనాభపురం కలనీ, పోరంకి సెంటర్, వందడుగుల రోడ్డు సాయినగర్ ప్రాంతాలతో పాటు, అగ్రికల్చర్ ఫీడర్‌లో 360 కనెక్షన్‌లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుంది. విద్యుత్‌శాఖ డీఈ ఎం.పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ వినియోగదారులకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు. త్వరలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

దాదాపు పనులు పూర్తి



సబ్‌స్టేషన్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉప్పలూరు నుంచి సరఫరా అందుతుంది. ఇకపై మారేడుమాక పరిసరాల్లోని ప్రజలకు సమర్థంగా విద్యుత్ సేవలు అందించేందుకు సబ్‌స్టేషన్ నిర్మాణం దోహదపడుతుంది. ఎక్కడా నాణ్యతా ప్రమాణాల్లో లోటుపాట్లు తలెత్తకుండా పర్యవేక్షణ చేశాం. త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– తాళ్లూరి అశోక్‌కుమార్, విద్యుత్ ఏఈ, కంకిపాడు

నేటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద, పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయాల్లో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు జరుగుతాయని లైబ్రేరియన్‌లు కె.జ్యోతికుమారి, కె.కృపానందం తెలిపారు. విద్యార్థులకు డ్రాయింగ్, కథలు, పుస్తక పఠనం, పేపర్ కటింగ్ అంశాలలో పోటీలు జరుగుతాయని, ఈ అవకాశం విద్యార్థులు వినియోగించుకోవాలని చెప్పారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: వేసవి సెలవులను పురస్కరించుకుని ఈ నెల 8నుంచి జూన్ 11వ తేదీ వరకు గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఉంగుటూరు లైబ్రేరియన్ స్వర్ణలత తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆమె మాట్లాడారు. ప్రతి రోజు కథలు, కథనాలు, సృజనాత్మక నృత్యాలతో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుందని చెప్పారు. మండలంలోని తేలప్రోలు, ఆత్కూరు, ఉంగుటూరు, మానికొండ జిల్లా శాఖ గ్రంథాలయాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

కట్టుదిట్టంగా పరీక్షల ఏర్పాట్లు



సిద్ధార్థ లా కాలేజీ వద్ద పోలీసుల బందోబస్తు మధ్య విద్యార్థులను అనుమతిస్తున్న దృశ్యం

పెనమలూరు: మండల పరిధిలో నీట్ యూజీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. వైద్య విద్య ప్రవేశం కోసం నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్టు -2023 పరీక్షకు మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరిగింది. మండలంలో సిద్ధార్థ లా కాలేజీ, కేసీపీ సిద్ధార్థ ఆదర్శ పాఠశాల, గంగూరు ధనేకుల ఇంజినీరింగ్‌కాలేజీ, పోరంకి సంవిద విద్యాపఠల్ పాఠశాలలో మొత్తం 1596 మంది అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యారులను పూర్తిగా తనిఖీ చేసిన తరువాతే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందన ఎటువంటి ఘటనలు జరగలేదని, పరీక్ష ప్రశాంతగా జరిగిందని సీఐ ఎం.కిషోర్ బాబు తెలిపారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్ రాణి



విద్యార్థిని ఖాజాబిని సత్కరిస్తున్న జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, చైర్‌పర్సన్ శ్రీనివాస్‌చౌదరి

గన్నవరం రూరల్: చదువుతోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. ఆదివారం మండలంలోని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో అత్యధిక మార్కులు సాధించిన షేక్ ఖాజాబి గృహానికి వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులతో కలసి వెళ్లి సత్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల జీవితాలు మారాలంటే చదువు ఒక్కటే ఆయుధమని నమ్మి ఆ బాటలో విద్యార్థుల సంక్షేమం, అభివృద్ధి కోసం వేలకోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ఆయన ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువులలో ఉన్నతంగా రాణిస్తున్నారని అన్నారు. పాఠశాలలో ప్రథమురాలిగా నిలిచి, గ్రామానికి మంచి పేరును సంపాదించిన ఖాజాబిని, ఆమె తల్లిదండ్రులను అభినందించారు. ఎంపీటీసీ సభ్యురాలు షేక్ మున్ని, సహకార బ్యాంకు చైర్‌పర్సన్ మేడసాని శ్రీనివాస్ చౌదరి, హైస్కూల్ పీఎంసీ చైర్మన్ కందుల రాజేష్‌కుమార్, గంగవరపు ప్రదీప్‌దాస్, అల్లా బక్షు, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..

ముస్తాబాద జెడ్పీహైస్కూల్ నుంచి 10వ తరగతి పరీక్షలలో 94మంది హాజరు కాగా వారిలో 567 మార్కులు సాధించి గ్రామానికి చెందిన షేక్ ఖాజాబీ స్కూల్ ఫస్ట్‌గా నిలిచింది. ఆమె తండ్రి షేక్ బాజీ ద్విచక్ర వాహనాల మెకానిక్‌గా ముస్తాబాదలో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన వసతులు, వనరుల సహాయంతోనే తమ బిడ్డ ప్రథమ స్థానం సాధించిందని రాణించిందని తండ్రి తెలిపారు. ఖాజాబీ తాను ఇంజినీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసింది.

పది ఫలితాల్లో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ



మేకల తన్విందు(577)



గుమ్మా ఉదయ్‌కుమార్(575)



మండల స్వాతి (570)



వరలక్ష్మి (569)

పెనమలూరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. పెనమలూరు పాఠశాలలో చదివిన మేకల తన్విందు 577 మార్కులు సాధించి మండలంలోనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన గుమ్మా ఉదయ్‌కిరణ్ 575 మార్కులు, మండల స్వాతి 570 మార్కులు, తాడిగడప జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని ఎ.వరలక్ష్మి 569 మార్కులు సాధించారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 39 మంది విద్యార్థులు 500 లకు పైగా మార్కులు సాధించారు. పాఠశాలలో 8 మంది విద్యార్థులు 550 కు పైగా మార్కులు, 31 మంది 500 లకు పైగా మార్కులు పొందారు. గతంలో లేని విధంగా విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించటంతో తల్లితండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం ఎలమంచిలి దుర్గాభవాని అభినందించారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

పెనమలూరు: నేటి నుంచి పెనమలూరు గ్రంథాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని బ్రాంచి గ్రంథాలయం అధికారిపి.హర్షిత అన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి 11 వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పుస్తకపఠనం, చిత్రలేఖనం, క్రాఫ్ట్, కథలు, వివిధ రకాల సృజనాత్మక కార్యక్రమాల పై శిక్షణ ఉంటుందన్నారు. చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్

కంకిపాడు: మూడు చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను కంకిపాడు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఎస్ ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు...మండలంలోని ఉప్పలూరు, కంకిపాడు, కోలవెన్ను శివారు మాదాసు వారి పాలెంలో మూడు చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయి. కేసు నమోదు చేసి సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. ఘటనల్లో చోరీకి పాల్పడ్డ విజయవాడ 2 టౌన్ వైఎస్సార్ కాలనీకి చెందిన దాసరి దానియేలు, విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ కు చెందిన మిందాల రాజును అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులను రాజమండ్రి జైలుకి తరలిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు.

గాయని ఉమాబలరాం సేవలు ఆదర్శనీయం



విజయవాడకల్చరల్: గాయని ఉమా బలరాం సంగీత సేవలు ఆదర్శనీయమని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. సరస్వతి కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో ఆదివారం సీనియర్ గాయని ఉమాబలరాం ఏక గళ సినీ సంగీత విభావరి, శాస్త్రీయ సంగీత ఆరాధనా కార్యక్రమం నిర్వహించారు. రమా సత్యనారాయణ మాట్లాడుతూ గాయనీగా ఉమబలరాం దేశ విదేశాల్లో అనేక ప్రదర్శనలు ద్వారా ప్రతిభను చాటుకున్నారన్నారు. సేవా రంగంలోనూ ఆమె సేవలను అందించారని తెలిపారు. కరోనా సమయంలో వేలాది మందికి నిత్యావసరాలను అందించారన్నారు. సరస్వతీ కళాపీఠం వ్యవస్థాపకురాలు మధిర రోజా ప్రసన్నత చేతుల మీదుగా ఉమాబలరాం దంపతులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, టి.శ్రీనివాసరెడ్డి, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న ప్రతాప్, పక్కన ఉమా సరస్వతి

విజయవాడ కల్చరల్: తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలు, భాషా వికాసానికి శ్రీశ్రీ కళావేదిక కృషి చేస్తోందని ఆ సంస్థ అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని బుక్ సొసైటీ ఫెస్టివల్‌లో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక క్రియాశీలక సభ్యులతో ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సాంకేతిక యుగంలోనూ వారసత్వ సంపదను భావితరాలకు అందించడానికి సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో సాహిత్య కార్యక్రమాలు, భాషా సదస్సులు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అంతర్జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ కొల్లి రమాపతి శ్రీశ్రీ కళావేదిక లక్ష్యాలను వివరించారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరీ భూషణం సంస్థ గతంలో నిర్వహించిన వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, శ్రీశ్రీ కళావేదిక జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టేలలిత, ఆంధ్రప్రదేశ్ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు హరిసర్వోత్తమ నాయుడు, ఓలేటి ఉమా సరస్వతి, కట్ల భాగ్యలక్ష్మి, కళావేదిక సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి తదితరులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతో దోహదపడతాయని కార్పొరేటర్ శర్వాణిమూర్తి పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు చిత్తరంజన్ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ సమ్మర్ క్యాంప్‌లో అనుభవం కలిగిన టీచర్స్‌చే పుస్తక పఠనం, కథలు చదివించడం, వినిపించుట, పుస్తక సమీక్షలు, స్పోకెన్ ఇంగ్లిషు, చిత్ర లేఖనం, పేపర్ ఆర్ట్, జనరల్ నాలెడ్జ్, బేసిక్స్ మేథమెటిక్స్, శ్లోకాలు, కోలాటం తదితర అంశాల్లో శిక్షణతో పాటు క్యారమ్, చెస్ వంటి ఆటలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి శిక్షణ శిబిరానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ కె.కృష్ణ ప్రణీత పాల్గొన్నారు.

దాసరి సేవలు వెలకట్టలేనివి

విజయవాడకల్చరల్: దర్శకుడు దాసరి నారాయణరావు సినీ రంగానికి చేసిన సేవలు వెలకట్టలేనివని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం దాసరి జయంతి, ఘంటసాల, మాధవపెద్ది, పిఠాపురం నాగేశ్వరరావుల స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ దాసరి నారాయణరావు అని ఎందరో యువ నటులను తెలుగు తెరకు పరిచయం చేశారన్నారు. శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో గాయకత్రయంగా పిలుచుకొనే ఘంటసాల, మాధవపెద్ది, పిఠాపురం మధుర గీతాలను మనకు అందించారన్నారు. వివిధ రంగాలకు చెందిన బీవీ వీరభద్రరావు, జ్ఞాన కిషోర్, ప్రసంగించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు డేవిడ్‌రాజు, దండు చంద్రశేఖర్, మల్లాది స్వాతి, దుర్గానాగమణి, హేమమాలిని పలు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలని వినతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గత టీడీపీ ప్రభుత్వం తమకు తీరని అన్యాయం చేసిందని, ఈ ప్రభుత్వంలో రెగ్యులర్ చేసి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సర్వీసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లంక మణికాంత్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002 డీఎస్సీ ద్వారా వైద్య ఆరోగ్య శాఖలో 3500 మందిమి ఉద్యోగాలు పొందామన్నారు. అప్పట్లో 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని నోటిఫికేషన్‌లో పొందుపరిచారని చెప్పారు. 2018 వరకు పీఆర్సీ ప్రకారం జీతాలు పొందామన్నారు. కానీ టీడీపీ ప్రభుత్వం జీఓ నంబరు 27 తీసుకొచ్చి పీఆర్‌సీ ద్వారా వేతనాలు పొందుతున్న తమను కన్సాలిడేటెడ్ పే కిందకు మార్చి అన్యాయం చేసిందన్నారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు గత ప్రభుత్వ నిర్ణయంతో అన్యాయం జరిగిందన్నారు.

నేటి నుంచి దివ్యకారుణ్యమూర్తి పుణ్యక్షేత్ర మహోత్సవాలు



తేరుపై ఏసుక్రీస్తు విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఫాదర్‌లు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద కొండపై ఉన్న ఏసు దివ్యకారుణ్యమూర్తి పుణ్యక్షేత్ర మహోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరుగనున్నాయి. విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఎం.బాలజోసఫ్ ఆంథోని ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం జపమాలతో ప్రారంభమై.. బుధవారం బిషప్ టి.జోసఫ్ రాజారావు ఉపదేశంతో మహోత్సవాలు ముగిస్తాయని విచారణ గురువులు ఫాదర్ ఎం.బాలజోసఫ్ ఆంథోని చెప్పారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు మూడు రోజుల పాటు కొండపై ప్రార్థనల్లో, సమష్టి దివ్యబలిపూజలో పాల్గొంటారన్నారు. అనేక మంది గురువులు మహోత్సవాలకు రానున్నట్లు చెప్పారు. ఆదివారం రెవరెండ్ ఫాదర్ బాలజోసఫ్ ఆంథోని ఆధ్వర్యంలో ఏసు క్రీస్తు ప్రభువు విగ్రహాన్ని భక్తులు తేరుపై ఊరేగించి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

అల్లూరి స్ఫూర్తితో దేశానికి సేవలు అందించాలి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో నేటి యువత దేశానికి సేవలు అందించాలని క్షత్రియ ఫెడరేషన్ సౌత్ చైర్మన్ సీహెచ్ వెంకటపతిరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతిపాటి శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీ గోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం, అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం చేపట్టారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన మహోన్నత వ్యక్తి అల్లూరి అని కొనియాడారు. కార్పొరేటర్లు పెనుమత్స శిరీష, శర్వాణీ మూర్తి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు దేశానికి అందించిన సేవలు ప్రతీ ఒక్కరి హృదయాల్లో ఎన్నటికీ నిలిచే ఉంటాయన్నారు. అనంతరం 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు, శ్రీ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు సామంతపూడి వెంకటేశ్వరరాజు, కార్యదర్శి దాట్ల భాస్కరరాజు, కోశాధికారి డీజేపీఎన్ రాజు, స్మారక గ్రంథాలయ అధ్యక్షుడు కాకర్లపూడి సుబ్బరాజు, కార్యదర్శి పి.వి.సుబ్బరాజు, సాంస్కృతిక సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎంప్లాయిూస్ సర్వీసులు క్రమబద్ధీకరించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మినిమం టైంస్కేల్, ఎస్ఎంఆర్, ఫుల్‌టైం-పార్ట్ టైం కంటింజెంట్ ఎంప్లాయీస్ సర్వీసులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్. సూర్యనారాయణ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో మినిమం టైంస్కేల్, ఎస్ఎంఆర్, ఫుల్‌టైం పార్ట్ టైం కంటింజెంట్ ఎంప్లాయీస్ రాష్ట్ర సంయుక్త కార్యాచరణ కమిటీ రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన సూర్యనారాయణ మాట్లాడారు.